సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం ၊ 30 ၊ జూలై ၊ 2024



కడప బ్యాట్స్‌మన్ జోరు
కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో కడప బ్యాట్స్‌మన్ రాణించడంతో కడప జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. - 8లో



ఉసురు తీసిన ఉత్సాహం
ముగ్గురు స్నేహితులు సరదాగా విహారయాత్రకు వెళ్లి మృత్యువాతపడ్డారు. మూడు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ దుర్ఘటన ఆదివారం జరిగింది. - 8లో

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

వాతావరణం
జిల్లాలో సోమవారం 26.8 - 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

'హెల్త్ ఎడ్యుకేటర్'గా పదోన్నతులు



పదోన్నతుల నియామక పత్రాలను అందజేస్తున్న డాక్టర్ రత్నకుమారి తదితరులు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) పరిధిలో సోమవారం 'హెల్త్ ఎడ్యుకేటర్'గా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. రాయలసీమ జిల్లాల పరిధిలో ఎంపీహెచ్ఏ (ఎఫ్)గా పనిచేస్తున్న ముగ్గురికి 'హెల్త్ ఎడ్యుకేటర్'గా పదోన్నతులు కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పదోన్నతులు కల్పించినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బత్తనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా కవిత



కవితను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

కలసపాడు : ఎస్టీయూ జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జె.పి.కవిత నియామకం హర్షించదగ్గ విషయమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బాలికల ఉన్నత పాఠశాలలో కలసపాడు ఎస్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో అభినందించారు. ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్‌బాబు, సత్యనారాయణ, శివారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు సలోమి సత్యవతి, మహబూబ్‌చాంద్, విజయభాస్కర్ రెడ్డి, వీరారెడ్డి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాల్సింది పోయి.. నైట్ వాచ్‌మెన్ విధులు చేయాలని ఆదేశించడం సరికాదని వీఆర్‌ఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన వీఆర్‌ఏలను వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్, వీఆర్‌ఓలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. సిద్ధవటం తహసీల్దార్ వీఆర్‌ఏలను నైట్ వాచ్‌మెన్ డ్యూటీ చేయాలంటూ ఆదేశించడంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వీఆర్‌ఏలు కష్టపడి పనిచేసినా వారికి డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు.

వైభవం.. పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని వీరభద్ర స్వామి ఆలయంలో పల్లకీ ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి స్వామి, భద్రకాళీ అమ్మవార్ల మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణ లతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. అనంతరం మాఢవీధుల్లో ఊరేగించారు.

శాంతిభద్రతలపై కర్నూలు డీఐజీ సమీక్ష

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో శాంతి భద్రతల పట్ల కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సమీక్షించారు. సోమవారం రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో శాంతిభద్రతల సమస్యలతో పాటు మదనపల్లె పట్టణంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం దగ్ధమైన కేసు దర్యాప్తు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. క్రమంలో ముందుగా జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బంది డీఐజీకి గౌరవవందనం సమర్పించారు

కంచెలంచెలుగా దాదార్‌గిరీ

తెలుగుదేశం నాయకులు బరి తెగిస్తున్నారు. కాదు కాదు గురి చూసి 'గిరి'కే కంచె వేస్తున్నారు. కనిపించిన కుంటల్ని.. ఊర్లోని చెరువుల్ని చెరబడుతున్నారు. విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నారు. చివరికి పేదలకిచ్చింది సైతం గద్దల్లా తన్నుకుపోతున్నారు. 'ఇదేంటని' ప్రశ్నిస్తే.. 'పచ్చ కార్డు ఇక్కడా' అంటూ అధికారం దర్పాన్ని.. అహంకార వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వేల ఎకరాల చుట్టూ కంచెలు లేస్తున్నాయి.

- ప్రభుత్వ స్థలాలకు కంచెలేస్తున్న టీడీపీ నేతలు
- జగనన్న కాలనీ కోసం నిర్దేశించిన 16ఎకరాలు చదును
- బ్రహ్మంసాగర్ నిర్వాసితుల కోసం రిజర్వు చేసిన 70 ఎకరాలు స్వాహా
- ఎమ్మెల్యే మావాడే... అంటూ రెవెన్యూ సిబ్బందిపై కన్నెర్ర చేస్తున్న వైనం

సర్వే నంబర్ 859లో ప్రభుత్వ భూమిని చదును చేసిన వైనం





నంద్యాలంపేట గ్రామ సర్వే నంబర్ 840లో ప్రభుత్వ భూమికి కంచె వేసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, కడప: అధికారమే పెట్టుబడిగా తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కబ్జాల పర్వం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. తాజాగా మైదుకూరు మండలం జాండ్లవరంలో వెలుగుచూసింది. ఎకరం రూ.20లక్షల విలువైన భూమిని తెలుగుతమ్ముళ్లు 86ఎకరాలు స్వాహా చేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నా సరే, 'ఎమ్మెల్యే మావాడే, ప్రభుత్వం మాదే, నోర్మూసుకొని వెళ్లండం టూ' రెవెన్యూ సిబ్బందిపై దౌర్జన్యానికి దిగి మరీ స్వాహా పర్వానికి దిగుతున్నారు.

మైదుకూరు నియోజకవర్గంలో తెలుగుతమ్ముళ్లు అక్రమార్కుల అవతారమెత్తారు. చెరువులు, వాగులు, పోరంబోకు భూములను చెరబట్టారు. ఎమ్మెల్యే పేరు చెబుతూ అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో జాండ్లవరం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారు. నంద్యాలంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వేనంబర్ 859లో 16 ఎకరాలు, సర్వేనంబర్ 840లో 70 ఎకరాలు భూమికి ఏకంగా కంచె వేస్తున్నారు. 'ఇదేమిటీ ప్రభుత్వ భూమిలో కంచె వేస్తున్నా'రని గ్రామసేవకులపై సదరు కబ్జాదారులు మండిపడినట్లు సమాచారం. ఇష్టారాజ్యంగా దూషిస్తూ 'మీకు దిక్కున్న చోట చెప్పుకోపోండి. ఎమ్మెల్యే మావాడే. ప్రభుత్వం మాదే' అంటూ రెచ్చిపోయినట్లు సమాచారం. చాపాడు మండలంలోని పల్లవోలు చెరువు సైతం ఆక్రమణకు గురయ్యింది. ఖాజీపేట మండలంలోని ముత్తలూరుపాడు కన్నెలవాగు చెరువును టీడీపీ వర్గీయులు ఆక్రమించి భూములుగా మల్చుకున్నారు. ఇవన్నీ కూడా కేవలం తెలుగుదేశం పార్టీ నాయకులమనే అహంకారంతో.. అదే అర్హతగా చెరబడుతున్నారు.

నాయుడు కనుసన్నల్లోనే కబ్జాలపర్వం

దాదర్ ఎక్స్‌ప్రెస్ నాయుడుగా గుర్తింపు పొందిన రామచంద్రనాయుడు టీడీపీ నాయకుడు. సుమారు 25 ఏళ్ల కిందట ఓ సారి దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ.. తన కళ్ల ముందే సామూహిక అత్యాచారం జరిగిందని మీడియాకు సమాచారమిచ్చాడు. అప్పట్లో అన్ని పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఆ తర్వాత అది అబద్ధమని తేలింది. అప్పటి నుంచి రామచంద్రనాయుడుని దాదర్ ఎక్స్‌ప్రెస్ నాయుడిగా పిలుస్తూ వస్తున్నారు. అప్పటి నుంచే మొదలైన ఇతని అబద్ధాలు.. అక్రమాలు తారా స్థాయికి చేరాయి. తాజాగా అతడి కనుసన్నల్లో నంద్యాలంపేట రెవెన్యూ పొలంలో భూములు కబ్జాకు గురవుతున్నట్లు పలువురు చెప్పుకొస్తున్నారు. జగనన్న కాలనీ కోసం సర్వే నంబర్ 859లో 16 ఎకరాలు నిర్ణయించారు. ఎకరం రూ.20లక్షలు విలు వ చేసే ఈ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాల కోసం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. వ్యక్తిగత కేటాయింపులు కూడా చోటుచేసుకున్నాయి. ఈ తరుణంలో కొంతమంది కోర్టును ఆశ్రయించి, ఆ భూమిలో పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్నారు. ప్రస్తుతం వ్యవహారం కోర్టులో ఉండగా నాయుడు కుటుంబ సభ్యులు ఆ భూమిని చదును చేసుకుంటున్నారు. అలాగే సర్వే నంబర్ 840లో 70 ఎకరాలు బ్రహ్మంసాగర్ నిర్వాసితుల కోసం కేటాయించారు. ఆ భూమికి సైతం నాయుడు బంధువులు కంచె వేస్తున్నారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించి భూములు కబ్జా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఐఏబీ సమావేశానికి డుమ్మా

ముఖ్యమైన సమావేశానికి హాజరుకాని ముగ్గురు ఎమ్మెల్యేలు



పుట్టా సుధాకర్ యాదవ్



పుత్తా చైతన్య రెడ్డి



ఆర్.మాధవిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప : రాయలసీమకు ప్రాణప్రదమైన శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతంగా ఉంది. 4.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో లభిస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు నింపుకునే అవకాశం ఉంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారెవ్వరైనా వరద జలాలు పట్ల తక్షణం స్పందించాల్సి ఉంది. సోమవారం నంద్యాలలో ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం ఏర్పాటు చేశారు. అత్యంత ముఖ్యమైన ఈ సమావేశానికి హాజరు కావాల్సిన ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. ప్రజల పట్ల, ప్రాంతం పట్ల ఆయా ప్రజాప్రతినిధులకు ఉన్న చిత్తశుద్ధి లోపం బహిర్గతమైంది.

రాయసీమ సాగునీటి ప్రాజెక్టుల ఐఏబీ సమావేశం మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ నేతృత్వంలో సోమవారం నంద్యాలలో నిర్వహించారు. శ్రీశైల జలాశయ వెనుక జలాలను సమర్థవంతంగా వినియోగించుకుని తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్, హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్ అంతర్భాగంగా ఉన్న ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకోవడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. పైగా నిర్దేశించిన సామర్థ్యంతో కాలువల్లో నీరు ప్రవహించేందుకు తక్షణ మరమ్మతులకు అత్యవసరమైన నిధుల కేటాయింపు ప్రతిపాదనలు కోరారు. కేసీ కెనాల్ పరధిలో 1,75,388 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉంది. అందులో 92వేల ఎకరాలు వైఎస్సార్ జిల్లాలో ఆయకట్టు ఉంది. ప్రధానంగా మైదుకూరు, కమలాపురం, కడప ప్రాంతాల్లో అత్యధికంగా ఆయకట్టు ఉంది. ఇంకో వైపు గండికోట, మైలవరం, వామికొండ, సర్వారాయసాగర్, బ్రహ్మంసాగర్, పైడిపాళెం ప్రాజెక్టుల్లో సుమారు 60 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. వాస్తవంగా నంద్యాల ఐఏబీ మీటింగ్ జిల్లాకు ప్రాణపదమేనని చెప్పాలి. అలాంటి సమావేశానికి మైదుకూరు, కమలాపురం, కడప ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాధవీరెడ్డి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు జిల్లా నుంచి హాజరయ్యారు. వరద జలాలు ఉన్నప్పుడే నీరు డ్రా చేసుకోవాల్సి ఉండగా ఆ ప్రాధాన్యతను ఎమ్మెల్యేలు గుర్తించలేదు. ప్రధానంగా మైదుకూరు పరిధిలో 54వేల ఎకరాల ఆయకట్టు ఉంది.ఎమ్మెల్యే పుట్టా బాధ్యత మర్చిపోయారని పలువురు వాపోతున్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ఎమ్మెల్యేలు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఏఎఫ్‌ఏయూ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథ్‌కుమార్, అధికారులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య రాజేష్ కుమార్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన 2వ సెమిస్టర్, ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన 4వ, 6వ, 8వ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ లో పొందుపరిచామన్నారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్రారెడ్డి, ఉదయప్రకాష్ రెడ్డి, లక్ష్మీ ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక పంపిణీ

కలెక్టర్ శివశంకర్ లోతేటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఇసుక పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్ సీ) సమావేశం, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్వో గంగాధర్ గౌడ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ వెంకట్రాముడు, డీటీసీ మీరా ప్రసాద్, మైన్స్ డీడీ రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. జిల్లాలో గండికోట రిజర్వాయర్ తీర ప్రాంతాలయిన కొండాపురం మండలంలోని చిత్రావతి నదీ పరివాహకంలో కొత్తగా గుర్తించిన పి.అనంతపురం/నేంద్రపేట, ఏటూరు, ఏ. సుగమంచిపట్నం, ఓబన్న పేట డిసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుక సేకరణకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ పాయింట్లలో మొత్తం 5,27,850 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో ఇసుక రీచులను సంబంధిత అధికారులు తరచుగా పరిశీలించాలన్నారు. డివిజన్ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు, మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి.. ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవోలు, డీఎస్పీలను ఆదేశించారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు ఏ మాత్రం అవకాశం లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గట్టి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని స్టాకు పాయింట్లు, ఇసుక రీచుల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిఘా పర్యవేక్షణను అమలు చేయాలన్నారు. డీపీఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్డీవోలు,డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

కలెక్టర్ శివశంకర్ లోతేటి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: పలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ సెల్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిలతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు డయల్ యువర్ కలెక్టర్ నిర్వహించారు.

ప్రజల ఫిర్యాదుల్లో కొన్ని..

- ఖాజీపేట మండలం అప్పనపల్లెకు చెందిన బి. వీరశేఖర్ తాను కొన్నేళ్లుగా పక్షవాతంతో నడవలేని స్థితిలో మంచానికే పరిమితం అయ్యానని.. ప్రత్యేక పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందించారు.
- వేంపల్లెకు చెందిన ఎం.సుశీల తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు పూర్తయినా బిల్లులు ఇంకా అందలేదని, బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు విన్నవించారు.
- సీకే దిన్నె మండలం ఊటుకూరుకు చెందిన గుర్రాల రెడ్డెమ్మ తన స్థలాన్ని కొందరు ఆక్రమించి గుడిని నిర్మించారని, తహసీల్దార్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
- తన భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేశారని... విచారించి తన పేరును ఆన్‌లైన్‌లో మార్చాలని ఖాజీపేట మండలం తుడుముల పల్లెకు చెందిన పి.వెంకట సురేష్ కోరారు.

ఆల్ ది బెస్ట్ ఒలింపియన్స్!

కడప స్పోర్ట్స్ : ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్-2024లో భారతీయులు ఉత్తమ ఫలితాలతో పతకాల పంట పండించాలని కలెక్టర్ శివశంకర్ ఆకాంక్షించారు. సోమవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఒలంపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపే ఫ్లేమ్‌లో ఆయన పాల్గొన్నారు. షూటింగ్ విభాగంలో మను బాకర్ పతకం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

బ్రౌన్ అభివృద్ధి నిధులు ఎక్కడ?

కడప కల్చరల్ : జిల్లాకు గర్వకారణంగా నిలిచిన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అభివృద్ధికి కేటాయించిన నిధులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయని ఆ కేంద్రం వ్యవస్థాపకులు, ప్రముఖ రచయిత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు విజయభాస్కర్ ప్రశ్నించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం నిర్వహణలో ఉన్న ఈ గ్రంథాలయం నూతన భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరైనా ఏమాత్రం అభివృద్ధి కనిపించడం లేదని వాపోయారు. నిధులు అందకుండా పనులు ప్రారంభం కాకుండా ఉండడానికి కారణం ఎవరో తెలుపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రశ్న తాను ఇప్పటికి చాలాసార్లు అడిగానని, కానీ ఏ అధికారి నుంచి కనీస సమాధానం లేకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్య పరిష్కారానికి బ్రౌన్ గ్రంథాలయ పాఠకులే ఉద్యమించాల్సి ఉందన్నారు. పైస్థాయిలో ప్రభుత్వ కార్యదర్శులు, న్యాయమూర్తులు సహకరిస్తున్నా విశ్వవిద్యాలయ స్థాయిలో స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. నిధుల పరిస్థితి గురించి వెంటనే తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరా లక్ష్యం

- వినియోగదారుల సేవల్లో అలసత్వం వద్దు
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి.. వాట్సాప్ నంబర్ 91333 31912
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ సంతోషరావు



తిరుపతి రూరల్ : విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంస్థ పరిధిలోని ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఫీడర్ ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్‌పై నిరంతరం సమీక్షిస్తూ, వాటిని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులుకు మెరుగైన, సత్వర సేవలందించేందుకు వీలుగా వాట్సాప్, చాట్ బోట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా నియంత్రికలు మరమ్మతుకు గురైతే వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయడం,చాట్ బోట్, 91333 31912 నంబరుతో వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

సబ్ కలెక్టరేట్ ఫైల్స్ దగ్ధం ఘటనపై సమగ్ర దర్యాప్తు

- కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్
- 12 బృందాలతో విచారణ



మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైల్స్ దగ్ధంకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్‌తో కలిసి డీఐజీ కోయప్రవీణ్ మాట్లాడుతూ...ఫైల్స్ దగ్ధం ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 135/2024 కింద కేసు నమోదుచేసి విచారణ సాగిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈనెల 21వ తేదీ రాత్రి 11.30 గంటలకు సంఘటన జరిగినప్పటి నుంచీ ఇప్పటి వరకు కేసు విచారణ క్రమపద్ధతిలో జరిగిందన్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్, ఆర్ఎఫ్ఎస్ఎల్ టీం, ఎలక్ట్రిసిటీ, ఫైర్, నాగపూర్ ఫైర్ రిస్కూ మేనేజ్‌మెంట్ సహాయంతో పటిష్ట దర్యాప్తు చేశామన్నారు. కేసులో ఇప్పటివరకు 52మందిని విచారించి, వారిలో కొందరిని అనుమానితులుగా గుర్తించామన్నారు. కేసు విచారణ దశలో ఉన్నందున పేర్లను వెల్లడించలేమన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటివరకు సెల్‌టవర్ డంప్ నుంచి 20వేలకు పైగా సీడీఆర్ సేకరించామన్నారు. అనుమానితుల వాట్సప్, ఐపీడీఎస్ అనాలసిస్ చేశామన్నారు. 750కి పైగా సగం కాలిన ఫైల్స్ విచారణలో సేకరించామన్నారు. ఘటనలో వైర్లు, బూడిద, ఆయిల్ శ్యాంపుల్స్ సేకరించి ఎఫ్ఎస్ఎల్‌కు రిపోర్ట్ కోసమై పంపామన్నారు. స్థానిక ప్రజలు, మీడియా అందించిన సమాచారం మేరకు అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి కొన్ని విలువైన డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని క్రోడీకరించి విచారించిన తర్వాత ఉండకూడని దస్త్రాలు కలిగి ఉన్నారన్న నేరంపై 8 కేసులు నమోదుచేశామన్నారు. ఫోరెన్సిక్ ఫలితాలు 10-15 రోజుల్లో వచ్చే అవకాశం ఉందని, ఫలితాల తర్వాత అనుమానితులపై నిర్ధారణకు వస్తామన్నారు. కేసు విచారణలో భాగంగా మాధవరెడ్డి, తుకారాం, శశికాంత్, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో పాటు మరికొందరి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అందులో మాధవరెడ్డి ఇంట్లో 500 విలువైన డాక్యుమెంట్స్ దొరికాయన్నారు. శశికాంత్ ఇంట్లో మదనపల్లె భూములకు సంబంధించి పత్రాలు లభించాయన్నారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో ప్రభుత్వ భూములకు సంబంధించి ఉండకూడని దస్త్రాలు కలిగిఉండటంపై కేసు నమోదు చేశామన్నారు. ఇదేవిధంగా ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిపై కేసు నమోదుచేసే అవకాశాలు ఉన్నాయన్నారు. సోదాల్లో దొరికిన డాక్యుమెంట్స్‌కు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన లావాదేవీలను పరిశీలించాల్సి ఉందన్నారు.

ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించి రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. మదనపల్లెలో గతంలో ఆర్డీవోగా పని చేసిన మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్, సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌లను సస్పెండ్ చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. అగ్నిప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. డీజీపీ ద్వారకాతిరుమలరావు, సీఐడీ చీఫ్ రవి శంకర్ ఇది అగ్నిప్రమాదం కాదని, ఫైర్ ఇన్సిడెంట్ అని పేర్కొన్నారు. ఇద్దరు ఆర్డీవోలతో పాటు సబ్ కలెక్టరేట్ సిబ్బంది 35 మందిని అదుపులోకి తీసుకుని ఐదు రోజుల పాటులో విచారించారు. కొంత మంది వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లల్లో పోలీసులు సోదాలు చేసి విచారించారు.

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


అఫ్రీన్‌బాను మృతదేహం

చింతకొమ్మదిన్నె : సయ్యద్ అఫ్రీన్ బాను (26) అనే వివాహిత ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. చింతకొమ్మదిన్నె ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపిన సమాచారం మేరకు చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లి గ్రామానికి చెందిన ఇక్బాల్‌బాషాతో 11 ఏళ్ల క్రితం సయ్యద్ అఫ్రీన్‌బానుకు వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొద్ది సంవత్సరాల నుంచి ఆమెను వరకట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో ఆదివారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. మృతురాలు ఆత్మహత్య చేసుకుందా లేక హత్య చేసి ఉరివేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతురాలి పెద్దమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం షాపులో చోరీ


మద్యంషాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ, క్లూస్‌టీం

అట్లూరు : అట్లూరు మద్యం షాపులో ఆదివారం రాత్రి రూ.4.80 లక్షల నగదు చోరీకి గురైంది. స్థానిక ఎస్ఐ కె.సి.రాజు కథనం మేరకు ఆదివారం రాత్రి మద్యం షాపులో చోరీ జరిగిందని వాచ్‌మన్ సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కడప నుంచి క్లూస్‌టీంను పిలిపించి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మద్యంషాపులో విధులు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని యువకుడు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి యువకుడు (25) మృతి చెందాడు. అనారోగ్యంతో ఉన్న అతన్ని సోమవారం ఉదయం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో అతనికి అత్యవసర విభాగంలో చికిత్స అందించారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఔట్‌పోస్టులో సంప్రదించాలని ఔట్‌పోస్టు ఇన్‌చార్జి షబ్బీర్ తెలిపారు.

కడపలో కర్నూలు రేంజ్ డీఐజీ

కడప అర్బన్ : కడపలోని ఆర్ అండ్ బీ అతిథి గృహానికి సోమవారం కర్నూలు – కడప రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ విచ్చేశారు. ఆయనను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కలిశారు. తరువాత జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, పోలీసు అధికారుల సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు నర్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపికను, పూలకుండీలను అందచేశారు. అనంతరం డీఐజీ అన్నమయ్య జిల్లా పర్యటనకు వెళ్లారు.

ఉసురు తీసిన ఉత్సాహం

ఈత సరదా ముగ్గురు యువకుల ప్రాణాలను మింగేసింది. తల్లిదండ్రుల ఆశలను చిదిమేసింది. చేతికందివచ్చిన బిడ్డలు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కన్నవారి వేదన వర్ణనాతీతంగా మారింది.

- రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ముగ్గురు యువకుల దుర్మరణం
- మరణంలోనూ వీడని స్నేహం
- ప్రొద్దుటూరులో విషాద ఛాయలు


రహంతుల్లా మృతదేహం వెలికి తీస్తున్న దృశ్యం

మైదుకూరు / దువ్వూరు / ప్రొద్దుటూరు క్రైం : ముగ్గురు స్నేహితులు సరదాగా విహారయాత్రకు వెళ్లి మృత్యువాతపడ్డారు. తెలుగు గంగ జలాశయంలోకి ఉత్సాహంగా ఈత కోసం దిగిన ఆ యువకులను మృత్యుదేవత తన ఒడిలోకి చేర్చుకుంది. మూడు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ దుర్ఘటన ఆదివారం జరిగింది. ప్రొద్దుటూరులోని మౌలానా అజాద్ మూడో వీధికి చెందిన పఠాన్ రహంతుల్లా (23), పవర్ హౌస్ రోడ్డుకు చెందిన ఎస్‌కే ముదస్సీర్ (22), సుందరాచార్యుల వీధికి చెందిన వేంపల్లి షాహిద్(23) అనే యువకులు ఆదివారం దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్ద ఉన్న మైదుకూరు మండల పరిధిలోని తెలుగు గంగ సబ్సిడరీ రిజర్వాయర్–1(ఏ, బీ బండ్) వద్దకు విహార యాత్రకు వెళ్లారు. అక్కడ ఉన్న పార్కులో కొంత సేపు గడిపిన తర్వాత రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. అక్కడ ఫొటోలు కూడా తీసుకున్నారు. రిజర్వాయర్‌లో ఈత కొట్టేందుకు దిగి గల్లంతయ్యారు. రాత్రి అయినా యువకులు ఇంటికి చేరుకోకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఫోన్‌లో విషయం తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఫోన్‌లు పనిచేయలేదు. సోమవారం ఉదయం యువకుల స్నేహితులను వాకబు చేశారు. విహార యాత్రకని తెలుగుగంగ రిజర్వాయర్ వద్దకు వెళ్లినట్లు తెలుసుకొని అక్కడికి చేరుకున్నారు. రిజర్వాయర్ కట్టపై యువకుల దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్‌లు ఉండటం చూసి వారి కోసం చుట్టుపక్కల వెతికారు. కనిపించకపోవడంతో రిజర్వాయర్‌లో గల్లంతై ఉంటారనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మైదుకూరు, దువ్వూరు పోలీసులు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. మైదుకూరు అర్బన్, రూరల్ సీఐలు మస్తాన్, శ్రీనాథ్‌రెడ్డి, దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బందిని, గజ ఈతగాళ్లను పిలిపించారు. వారు రిజర్వాయర్‌లో గాలించి సోమవారం మధ్యాహ్నానికి యువకుల మృతదేహాలను వెలికి తీశారు. రిజర్వాయర్ గేట్ల వద్ద సుమారు 30 అడుగుల లోతు నీరు ఉండటంతో నీటిలోకి దిగిన యువకులకు ఈత రాక మునిగిపోయి మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. గత ఈతగాళ్ల మృతదేహాలను వెలికి తీయగానే వారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా


రహంతుల్లా మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి నాయబ్‌రసూల్

శోకసంద్రంలో మునిగిపోయారు. గుండెలవిసేలా రోదించారు. సరదా కోసం రిజర్వాయర్‌లోకి దిగి మృత్యువాత పడిన ముగ్గురు యువకులు వారి కుటుంబాలకు ఆసరాగా ఉండాల్సిన సమయంలో తీరని దుఃఖాన్ని మిగిల్చారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు అర్బన్ సీఐ మస్తాన్ తెలిపారు.

వాళ్లకు అదే చివరి ఫొటో..

ముదస్సీర్, రహ్మతుల్లా, షాహిద్‌లు కలసి ఎన్నో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అయితే ఈత కొట్టేందుకు రిజర్వాయర్‌లో దిగే ముందు ముగ్గురూ చివరి సారిగా సెల్ఫీ తీసుకున్నారు. అయితే వారికి అదే చివరి సెల్ఫీ అయింది. ఈ సెల్ఫీ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. వారి స్నేహం పట్ల విధి చిన్న చూపు చూసిందంటూ అందరూ కామెంట్లు పెడుతున్నారు. కాగా యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చెప్పకుండా ఎప్పుడూ వెళ్లలేదు..


పఠాన్ రహ్మతుల్లా (ఫైల్)

ప్రొద్దుటూరులోని మౌలానాఆజాద్ వీధి–3 కి చెందిన పఠాన్ రహ్మతుల్లా స్థానికంగా ఉండే వెంకటేశ్వర ఫార్మసీ కాలేజీలో బీ ఫార్మసీ చదువుతున్నాడు. అతని తండ్రి నాయబ్ ఆర్ట్స్‌కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు రహ్మతుల్లాతో పాటు నూరుల్లా అనే మరో కుమారుడు ఉన్నాడు. అతను బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సయయంలో స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నానని చెప్పి రహంతుల్లా ఇంటి నుంచి వెళ్లాడు. ఇంట్లో చెప్పకుండా అతను ఎక్కడికీ వెళ్లేవాడు కాదు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌లు చేయసాగారు. అయితే ఫోన్ తగలకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. తోటి మిత్రులను అడుగగా తెలుగుగంగ రిజర్వాయర్ వద్దకు వెళ్లినట్లు చెప్పారు. దీంతో రాత్రి సమయంలో అక్కడికి వెళ్లినా వారి జాడ కనిపించలేదు. చెప్పకుండా ఎప్పుడూ రహ్మతుల్లా బయటికి వెళ్లలేదని, ఇప్పుడు ఎందుకు వెళ్లాడో అర్థం కావడం లేదంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. చివరకు రిజర్వాయర్‌లో పడి మృతి చెందాడనే విషయం తెలియడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు.

సరదాగా గడపాలని..


ముదస్సిర్ (ఫైల్)

ప్రొద్దుటూరులోని పవర్‌హౌస్ రోడ్డుకు చెందిన షేక్ ముదస్సిర్ చిత్తూరులోని ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. అతని తండ్రి మున్వర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు ముదస్సీర్‌తో పాటు ముజమ్మిల్, ముస్తఖైమ్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. ముదస్సీర్ చిత్తూరు నుంచి శనివారం ఉదయం వచ్చాడు. స్నేహితులను కలుసుకోవాలనే ఉద్దేశంతో మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వచ్చాడు. చిన్ననాటి స్నేహితులైన రహ్మతుల్లా, షాహిద్‌లను కలుసుకున్నాడు. ముగ్గురూ కలిసి ఈత కొట్టేందుకు తెలుగుగంగ రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. సాయంత్రానికి తిరిగి వస్తానని ముదస్సిర్ ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా కలవలేదు. చివరకు కుటుంబ సభ్యులు, స్నేహితులు రిజర్వాయర్ వద్దకు వెళ్లి వెతికినా వారు కనిపించలేదు. తెలుగుగంగ రిజర్వాయర్‌లో గల్లంతైనట్లు సోమవారం ఉదయం వారికి తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు విలపించసాగారు.

స్నేహితులు పిలవడంతో వెళ్లి..


వేంపల్లె షాహిద్ (ఫైల్)

ప్రొద్దుటూరులోని సుందరాచార్యుల వీధి రోడ్డు సమీపంలోని ఆసారేషరీఫ్ వీధిలో నివాసం ఉంటున్న వేంపల్లె షాహిద్ మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. అతని తండ్రి అల్తాఫ్ రెండేళ్ల క్రితం కామెర్ల వ్యాధితో మృతి చెందాడు. అతనికి షాహిద్‌తో పాటు షాబాజ్, షానవాజ్ అనే కుమారులు ఉన్నారు. షాహిద్ తల్లి జబిన్ గృహిణి. స్నేహితులు రమ్మని చెప్పడంతో అతను వారితో కలిసి స్కూటీలో ఈతకు వెళ్లాడు. రిజర్వాయర్ పడి మృతి చెందాడని తెలియడంతో తల్లి జబిన్‌తో పాటు కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

సాటి మానవుల సేవలతోనే జన్మధన్యం

- లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సీనియర్ నేత లయన్ పి.ఖాసింఖాన్

కడప కల్చరల్ : సాటి మనుషులకు సేవలు అందించడంతోనే జన్మధన్యం చేసుకోవచ్చని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సీనియర్ నేత లయన్ పి.ఖాసింఖాన్ పేర్కొన్నారు. సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఆర్తులకు సేవలందించడంలో స్ఫూర్తి లభిస్తుందని, అర్హులైన పేదలకు సాయపడే అవకాశం వస్తుందని, దీంతో మనిషిగా మన జన్మను సార్థకం చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా లయన్ పి.ఖాసింఖాన్ సంవత్సరంపాటు క్లబ్ సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం రూ. 50 వేలు విరాళాన్ని లయన్ కె.చిన్నపరెడ్డి ద్వారా నూతన అధ్యక్షులు అనంతబొట్ల వెంకట సుబ్బయ్యకు అందజేశారు. ఇంటాక్ సభ్యులు మేరి జోసిఫినమ్మ రూ. 5 వేలు, లయన్స్ సభ్యులు కె.సంజీవరెడ్డి రూ. 25 వేలు, గౌరీశంకర్ రూ. 20 వేలు వేదికపైనే నూతన అధ్యక్షునికి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి పదవీ బాధ్యతలను నూతన అధ్యక్షునికి అప్పగించారు. సంస్థ నూతన ఉపాధ్యక్షులుగా బోగాల కొండారెడ్డి, కార్యదర్శిగా కొండూరు జనార్దన్‌రాజు, సహ కార్యదర్శిగా ఎస్ఎండీ బాషా, కోశాధికారిగా దేవతి రవీంద్రనాథ్, గౌరీశంకర్, మహేష్‌లచే సీనియర్ లయన్ నేతలు రామచంద్ర ప్రకాశ్, విరూపాక్షిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్‌నాథ్‌రెడ్డి, పెసల శ్రీకాంత్, హరినాథరెడ్డిలు ప్రమాణ స్వీకారం చేయించారు. విధివిధానాలను వివరించారు. కొత్తగా చేరిన 31 మంది సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకించి ఈసారి మహిళా సభ్యులు ఎక్కువగా చేరడంతో మరికొందరు చేరగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, నూతన సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

కడప బ్యాట్స్‌మన్ జోరు


147 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ గురుచరణ్


103 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన గీత్


రాజారెడ్డి స్టేడియంలో తలపడుతున్న కృష్ణా, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో కడప బ్యాట్స్‌మన్ రాణించడంతో కడప జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 132 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 452 పరుగులు చేసింది. జట్టులోని ఎస్. గురుచరణ్ 147 పరుగులు, రోహిత్ 82 పరుగులతో రాణించారు. శ్రీకాకుళం బౌలర్లు జున్నారావు 3, సుశాంత్ 2, పూర్ణ 2 వికెట్లు తీశారు. కాగా శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 204 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కాగా రెండోరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 248 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

హోరాహోరీగా కృష్ణా, చిత్తూరు మ్యాచ్..
వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 370 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 97.2 ఓవర్లలో 396 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని గీత్ 103 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చిత్తూరు బౌలర్లు సాయిచరణ్ 5, బాలాజీ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 331 పరుగులు చేసింది. జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 75, చరణ్‌జీత్ 60, గౌతమ్ కృష్ణ 93 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. కృష్ణా బౌలర్ రాజేష్ 3 వికెట్లు తీశాడు. దీంతో చిత్తూరు జట్టు 65 పరుగుల తేడాతో వెనుకంజలో ఉంది.

పశ్చిమ జట్టుకు 356 పరుగుల లక్ష్యం..
కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టుకు 356 పరుగుల లక్ష్యాన్ని విశాఖ జట్టు నిర్దేశించింది. 123 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 131 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని చరణ్‌సాయితేజ 42, హర్షవర్ధన్ 18 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు రచిత్ 4, యువన్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు 67.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 366 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని బి. యశ్వంత్ 118 పరుగులు, యువన్ 119 పరుగులతో రాణించారు. పశ్చిమగోదావరి బౌలర్లు చరణ్‌సాయితేజ 2, రేవంత్ నాగకుమార్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. జట్టులోని ప్రణీత్‌పవన్ 21 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్ దేవాశిష్ 2 వికెట్లు తీశారు. కాగా విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించాలంటే 356 పరుగులు చేయాల్సి ఉంది.

ప్రజలను దగా చేసేందుకే ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బద్వేలు అర్బన్ : ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను దగా చేసేందుకే సీఎం చంద్రబాబునాయుడు ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్లారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరిసుధ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్లడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే ఆదాయాలు, ఖర్చులు, రుణాల మొత్తం ఎంత అని వివరించడంతో పాటు ఏయే శాఖలకు, ఏయే పథకాలకు ఎంత ఖర్చు పెడుతున్నారనే వివరాలు చెప్పాల్సి వస్తుందన్నారు. అందుకే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్లారన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే రెండు రోజుల ముందు కేంద్రం నుంచి రాష్ట్రానికి డివల్యూషన్ రూపంలో రావాల్సిన రూ.5655 కోట్లు వచ్చాయన్నారు. మొత్తంగా రూ.7 నుంచి 8 వేల కోట్లు అందుబాటులో ఉన్నప్పటికీ పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం లేదన్నారు. ఇందుకు కారణం వాగ్దానాల నుండి తప్పించుకుని ప్రజలను మోసగించే పన్నాగమే అని విమర్శించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఖజానాలో కేవలం వంద కోట్లు మాత్రమే ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టి పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి ఖాతాల్లో రూ.2.71 లక్షల కోట్లు జమ చేశారని వివరించారు.

ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ వారి సహకారంతో సోమవారం హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ తరువాత ఉచితంగా హెల్మెట్‌లను పంపిణీ చేశారు. కడపలోని జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఇన్‌చార్జి చైర్మన్, ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించడంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలను రైతులకు అందించాలి


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ సుమతి

కడప అగ్రికల్చర్ : వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విజయవంతమైన పంటల పరిశోధన ఫలితాలను రైతులకు క్షేత్రస్థాయిలో అందించాలని దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఏడీఆర్ సుమతి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్రయోగాత్మకంగా సాగులో ఉన్న వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశోధనా ఫలితాలను రైతులకు క్షేత్రస్థాయిలో అందించాలన్నారు. అలాగే వారి పంటల సాగుకు కావాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చి వారి అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ ఆచారి, కేవీకే, ఏరువాక కేంద్రాల సమన్వయకర్తలు వీరయ్య, అంకయ్య కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభాకర్ రెడ్డి, సునీల్ కుమార్, శిల్పకళ, మహేశ్వరి, భాగవతి ప్రియ, కృష్ణప్రియ, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సర్కిల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

బద్వేలు అర్బన్ : స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కార్యాలయంలోని పలు సామగ్రి దగ్ధమైంది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే ఆదివారం రాత్రి సిబ్బంది విధులు ముగించుకుని వెళ్లిన తర్వాత సుమారు 11–30 గంటల సమయంలో రైటర్ గదిలో నుంచి పొగలు వస్తుండటంతో అర్బన్ స్టేషన్‌లో సెంట్రీగా ఉన్న కానిస్టేబుల్ గమనించి వెంటనే సీఐకి సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో రెండు కంప్యూటర్లు, లా పుస్తకాలు, ఒక వైర్‌లెస్ సెట్, రెండు చైర్లు, టేబుల్, ఇన్వర్టర్, బ్యాటరీలు దగ్ధమయ్యాయి. సీఐ బి.వి.విక్రమసింహ మాట్లాడుతూ కార్యాలయంలోని అన్ని రికార్డులు భద్రంగా ఉన్నాయని తెలిపారు. కార్యాలయాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి ఐ.ధర్మారావు, ట్రాన్స్‌కో ఏడీఈ కుళాయప్ప పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన జ్యోతి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మైదుకూరు– బద్వేలు జాతీయ రహదారి జెడ్. కొత్తపల్లె వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగిన జ్యోతి (35) అనే మహిళ మృతి చెందింది. బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ కథనం మేరకు.. ప్రొద్దుటూరు దొరసానిపల్లెకు చెందిన మంగిన శ్రీధర్ విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా ఉన్నాడు. శ్రీధర్, జ్యోతిల కుమార్తె గుంటూరులోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం కుమార్తెను చూసేందుకు కారులో వెళ్లి సోమవారం తిరిగి వస్తుండగా బద్వేలు నుంచి మైదుకూరు వైపు వెళుతున్న లారీని జెడ్.కొత్తపల్లె వద్ద క్రాస్ చేయబోయి ప్రమాదవశాత్తు లారీని ఢీకొట్టడంతో ముందు సీట్లో ఉన్న జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో బయటపడిన ఆమె భర్త శ్రీధర్ బి.మఠం పోలీసులకు ఫోన్ చేయడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. జ్యోతిని బయటకు లాగి 108 వాహనంలో ఎక్కించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు.

గంజాయి విక్రేతలపై దాడులు

- 6.6 కిలోల గంజాయి స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బృందాలతో కూడిన డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో సోమవారం పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మెరుపు దాడులు నిర్వహించారు. 6.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు.

- చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో డి.ఎస్.ఆర్ ఆయిల్ మిల్ సమీపంలో పుల్లయ్య అనే నిందితుడిని సీఐ నారాయణ యాదవ్ తమ సిబ్బందితో అరెస్ట్ చేసి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనార్దన్, ఓబులేసులను అరెస్టు చేసి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని సీఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రంగస్వామి తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు.
- కడప రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జగదీష్ అనే నిందితుడిని సీఐ కె. రామచంద్ర, ఎస్ఐ నారాయణ అరెస్టు చేసి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.